సాక్షి
తిరుపతి

మంగళవారం । 17 । జూన్ । 2025



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పెంచలకోనలో సోమవారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారున.

- 8లో



'మామిడి' పోరు

మామిడి రైతులు సోమవారం చిత్తూరులో రోడ్డెక్కారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఆందోళన చేపట్టారు.

- 8లో



సమస్యల వెం'బడి' వినతులు

క్లస్టర్ విధానంలో పాఠశాలలను మరో ఊరుకు మార్చవద్దని కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో పలువురు వినతులు అందించారు.

- 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేత



లీలావతికి కండువా కప్పుతున్న నూకతోటి రాజేష్

కేవీబీపురం : మండలంలోని ఓళ్లూరు గ్రామానికి చెందిన టీడీపీ నేత, ఉపాధి హామీ మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ లీలావతి వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం ఈ మేరకు పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. లీలావతి మాట్లాడుతూ సుమారు 25 ఏళ్లుగా టీడీపీకి సేవలందించానని, ఆ పార్టీలో నేతల కుట్రపూరిత వైఖరి నచ్చలేదన్నారు. వైఎస్సార్‌సీపీ విధి విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు బొర్రా మాధవీరెడ్డి ప్రోత్సాహంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 99 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి క్రైమ్ : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 99 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఆయా అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు ఏటీజీహెచ్ వరకు బారులు తీరారు. ఆదివారం అర్ధరాత్రి వరకు 90,815 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 35,007 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.52 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈక్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వస్తే క్యూలో అనుమతించమని స్పష్టం చేసింది.

కాలువను కాపాడాలని వినతి



జేసీకి వినతి పత్రం అందిస్తున్న ఎంపీపీ చంద్రమోహన్ రెడ్డి

తిరుపతి రూరల్ : చంద్రగిరి మండలం తొండవాడ సమీపంలోని ముక్కోటి ఆలయం వద్ద స్వర్ణముఖి నది నుంచి పేరూరు చెరువుకు వరద నీటిని తీసుకువచ్చే కాలువను కాపాడాలని ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి కోరారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం జంక్షన్ నుంచి రేణిగుంట మండలం గాజులమండ్యం జంక్షన్ వరకు చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పేరూరు చెరువుకు నీరందించే కాలువను పూడ్చివేస్తున్నారని పేర్కొన్నారు. మళ్లీ కాలువ తవ్విస్తామని చెబుతున్నారని తెలిపారు. అయితే కాలువ నిర్మాణానికి ఇప్పుడే మార్కింగ్ వేయించి విస్తరణ పనులతో పాటు కాలువ నిర్మాణ పనులు కూడా పూర్తి చేయించాలన్నారు. పేరూరు చెరువులో నీరు చేరితే పలు పంచాయతీల ప్రజలకు దాహార్తి తీరుందని వివరించారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ ఈ మేరకు నేషనల్ హైవేఅథారిటీ వారికి ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.



మైకా ఖనిజం ఇదే



సైదాపురం మండలంలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న మైనింగ్

ఖనిజం దోపిడీ!

కూటమి నేతల కనుసన్నల్లో అత్యంత విలువైన ఖనిజాలను అడ్డగోలుగా దోచేస్తున్నారు. ఇష్టారాజ్యంగా తవ్వకాలు సాగిస్తూ రూ.కోట్లు దోపిడీ చేస్తున్నారు. సైదాపురం మండలంలోని క్వార్ట్జ్..మైకా గనులను కొల్లగొట్టేస్తున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా అక్రమార్కులు యథేచ్ఛగా మైనింగ్ చేసేస్తున్నారు. అవలీలగా విదేశాలకు తరలించి జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారు.

సిండికేట్ కబంధహస్తాల్లో గనులు

- కూటమి నేతల కనుసన్నల్లో అక్రమ మైనింగ్
- ప్రభుత్వ ఆదాయానికి రూ.వందల కోట్ల గండి
- సైదాపురం మండలంలో యథేచ్ఛగా దందా

సాక్షి, టాస్క్‌ఫోర్స్: సైదాపురం మండలంలోని క్వార్ట్జ్ గనుల్లో యథేచ్ఛగా అక్రమం మైనింగ్ సాగుతోంది. కూటమి నేతల కనుసన్నల్లో సిండికేట్‌గా ఏర్పడి ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. సిండికేట్‌కు కప్పం కట్టిన వారికి మాత్రమే మైనింగ్ చేసుకునే అవకాశం ఇస్తున్నారు. కాసులు చెల్లించని వారి గనులకు మాత్రం అనుమతులు నిరాకరిస్తున్నారు. దీంతో మైనింగ్ ఆదాయం 90 శాతం మేర పడిపోయింది. మరోవైపు పచ్చ నేతలు మాత్రం ఎక్కడికక్కడ గనులను స్వాధీనం చేసుకుని రూ.కోట్లు గడిస్తున్నారు. ఇదంతా కూటమి ముఖ్యనేత నేతృత్వంలోనే జరుగుతుండడం గమనార్హం. 12 నెలలుగా కూటమి నేతలు క్వార్ట్జ్ , మైకా క్వార్ట్జ్ గనులను తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. ఖనిజాలను సిండికేట్‌కే అప్పగించాలనే షరతులతో గనుల యజమానులు తవ్వకాలు చేసుకునేందుకు అనుమతులు మంజూరు చేయడం విశేషం.

విదేశాల్లో మంచి గిరాకీ

సైదాపురం మండలంలో లభించే మైకా, క్వార్ట్జ్‌కు విదేశాలల్లో మంచి గిరాకి ఉంది. దీంతో పలు దేశాల పారిశ్రామిక వేత్తలు ఈ ఖనిజాలను కొనుగోలు చేసుకునేందుకు పోటీ పడేవారు. ప్రస్తుతం మైనింగ్ మొత్తం రెండు కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోయాయి. అవి కూడా ముఖ్యనేతవే కావడంతో వారు చెప్పిన ధరకే ఖనిజాలను ఇవ్వాల్సి ఉంది. వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాల్లో దాదాపుగా 140 ఓపెన్ కాస్ట్, 7 అండర్ గ్రౌండ్ మైనింగ్ గనులున్నాయి. వాటిలో కప్పం కట్టడంతో పాటు ఖనిజాన్ని మీకే ఇస్తామన్న గనులకు మాత్రమే అనుమతులను మంజూరు చేశారు.

గతంలో రూ.50 వేలు.. ఇప్పుడు రూ.20 వేలే..

ప్రధానంగా మొదటి నుంచి ఇక్కడ దొరికే ఖనిజాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. వీటిని జపాన్, చైనా దేశాలకు ఎగుమతులు చేస్తుంటారు. అప్పట్లో గని యజమానుల నుంచి ఎగుమతి దారులే టన్ను రూ.50వేల వంతున కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం టన్ను రూ.20 వేలకు కూడా కొనే వారు లేకపోవడంతో మైనింగ్ యజమానులు ఆందోళన చెందుతున్నారు.అది కూడా సిండికేట్‌కే ఇవ్వాల్సిన దుస్థితి.

త్రిమూర్తులకే అనుమతులు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సిండికేట్ ఏర్పడిన తర్వాత వారికి అనుకూలంగా ఉన్న ముగ్గురు యజమానులదే హవాగా కొనసాగుతోంది. వారికి సుమారుగా 14 గనులుండడం విశేషం. దీంతో వీరు చెప్పిదే వేదంగా నడుస్తోంది. వీరి గనుల నుంచి నిత్యం రవాణా కొనసాగుతుంది. ప్రస్తుతం అనుమతులు పొందిన ఈ మూడు కంపెనీలకు చెందిన వారే అధికంగా ఖనిజాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఆదాయానికి గండి

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఇప్పటికే రూ.250 కోట్ల ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోల్పోయింది. మైనింగ్ పరిశ్రమ ద్వారా నెలకు రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు రాయల్టీ రూపేణా ప్రభుత్వానికి ఆదాయం వస్తుండేది. ఈ క్రమంలో ఏడాదిగా మైనింగ్ పరిశ్రమ కూటమి నేతల సిండికేట్ గుప్పిట్లోకి వెళ్లడంతో సర్కారు ఆదాయానికి గండిపడింబదని పలువురు వ్యాపారవేత్తలు ఆరోపిస్తున్నారు.

అధికారులకు నెలవారీ వాటాలు

సిండికేట్ అనుమతులు పొందిన వారు ఇష్టానుసారంగా ఖనిజాలను తరలించేస్తున్నారు. ఇందుకోసం కొన్ని శాఖల అధికారులకు నెలవారీ వాటాలు చేరుతున్నట్లు సమాచారం. అధికారులు పట్టించుకోకపోవడతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారు. వారికి కూటమి నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయి.

అధిక టన్నేజీతో రవాణా

సిండికేట్ అనుమతితో తరలిపోతున్న ఖనిజాలను అధిక టన్నేజీతో రవాణా చేస్తుండటం గమనార్హం. టిప్పర్లు, లారీలకు వేయాల్సిన టన్నేజీల కన్నా అధికంగా ఖనిజాలను నింపి ఎగుమతి చేస్తున్నారు. దీనిపై రవాణా శాఖ అధికారులతో పాటు మైనింగ్, పోలీసులు ఎలాంటిచర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఇటీవల పోలీసులకు పట్టుబడిన ముడి ఖనిజం



మైనింగ్ చేసేందుకు యంత్రాలను తరలిస్తున్న దృశ్యం



అధిక టన్నేజీతో వెళుతున్న టిప్పర్లు

ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంపు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆర్ఐఓ జి.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అడ్మిషన్ల గడువు తేదీని పొడిగిస్తూ ఇంటర్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సౌభాగ్యదాయకం.. 'సుందరకాండ'



భరత్‌శర్మను సత్కరిస్తున్న అతిథులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : సుందరకాండ సకల సౌభాగ్యదాయకమని, హనుమంతుని అనుగ్రహంతో ఏదైనా సాధించే శక్తిని పొందగలమని శతావధాని ఉప్పల, దడియం భరత్ శర్మ ప్రవచించారు. సోమవారం తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో సుందరకాండ, హనుమద్వైభవంపై భరత్ శర్మ ఆధ్యాత్మిక ప్రవచనం చేపట్టారు. అందులో భాగంగా రామాయణ మహత్యం, సుందరకాండ విశిష్టత, అంతరార్థం, హనుమంతుని చాకచక్యం, శ్రీరాముని కార్యంపై అంజనీసుతుని దీక్ష, నేటి సమాజంలో ఇతిహాసాల అన్వయం తదితర విశేషాలను భరత్ శర్మ వివరించారు.మహర్షుల వా/ఙ్మయం మొత్తం వైజ్ఞానికమే అని, ప్రస్తుత సమాజంలో మానవుని జీవనానికి దిశానిర్దేశం చేస్తుందని వెల్లడించారు. ఈ సందర్భంగా భరత్‌శర్మను రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్, కళాకారులు టీచర్ తిరుమలయ్య, ప్రభాకర్‌నాయుడు, సుబ్రమణ్యంరెడ్డి, సురేష్ స్వామి సత్కరించారు. కార్యక్రమంలో భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ఆటోలకు ఆధునిక కోడ్



క్యూఆర్ కోడ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్ : ఆధ్యాత్మిక క్షేత్రంలో ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ఆటోలకు ఆధునిక క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. సోమవారం తిరుపతిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆటోలకు డిజిటల్ నంబర్ ప్లేట్ల నమోదును ఆయన ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రయాణికులు తాము ఎక్కిన ఆటోకు సంబంధించి పూర్తి వివరాలు క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే వెల్లడికానున్నట్లు చెప్పారు. ప్రజలు సురక్షితంగా గమ్య స్థలానికి చేరేలా భరోసా కల్పించేందుకే డిజిటల్ నంబర్ ప్లేట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో డ్రైవర్ వివరాలతోపాటు ఏ ఫోర్ సైజ్ డిస్‌ప్లే బోర్డు, క్యూఆర్ కోడ్‌తో కూడిన రెండు స్టిక్కర్లు ఉంటాయన్నారు. క్యూఆర్ కోడ్‌ను గూగుల్ లెన్స్ ద్వారా స్కాన్ చేస్తే ట్రాక్ లోకేషన్, డ్రైవర్ పనితీరు, ప్రవర్తన, అత్యవసర సమయాల్లో 112 నంబర్‌కు కాల్, సమీపంలోని పోలీస్ స్టేషన్, అధికారుల నంబర్లు అందుబాటులోకి వస్తాయని వివరించారు.

రికార్డులు అందించాలి

డిజిటల్ నంబర్ తీసుకోవాలంటే ఆటో ఓనర్, డ్రైవర్ తమ వాహనం పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వాహనానికి సంబంధించిన అన్ని రికార్డులతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను ట్రాఫిక్ పోలీసులకు అందజేయాలని సూచించారు. పోలీసులు ఈ వివరాలను ప్రత్యేక వెబ్‌సైట్‌లో నమోదు చేసి క్యూ ఆర్ కోడ్ ఇస్తారని వెల్లడించారు. నగరంలోని ఆటో డ్రైవర్లందరూ పోలీసులకు సహకరించి డిజిటల్ నంబర్ పొందాలని ఆదేశించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు రవి మనోహరాచారి, నాగభూషణం, రామకృష్ణమాచారి, శ్యామసుందర్, భక్తవత్సలం పాల్గొన్నారు.

హాస్టల్ మూసివేతపై ఆందోళన

తిరుపతి సిటీ : ఎస్వీయూలో పరిశోధక విద్యార్థులకు కేటాయించిన ఐ బ్లాక్ హాస్టల్ మూసివేతపై ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ రిజిస్ట్రార్, వార్డెన్ ఐబ్లాక్ హాస్టల్‌ను రెండు నెలలుగా మరమ్మతుల పేరుతో మూసివేశారని ఆరోపించారు. వెంటనే వసతి గృహాన్ని పరిశోధక విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురాకుంటే రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

డయేరియా నిర్మూలనే లక్ష్యం



బ్యానర్, పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

తిరుపతి అర్బన్ : జిల్లాలో డయేరియా నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని, ఈ మేరకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, డీఎంహెచ్‌ఓ బాలకృష్ణనాయక్‌తో కలసి డయేరియా నిర్మూలనపై బ్యానర్, పోస్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూలై 31వ తేదీ వరకు ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు స్టాప్ డయేరియా సిస్టమ్ అమలు చేయాలని స్పష్టం చేశారు. రోజుకు 3 కంటే ఎక్కువసార్లు నీళ్ల విరేచనాలు అయితే డయేరియాగా భావించాలని తెలిపారు. ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ తోపాటు జింక్ మాత్రలు అందించాలని, విరేచనాల సమయంలో పిల్లలకు పోషకాహారం ఇవ్వడం ద్వారా డయేరియాను నివారించవచ్చునని వివరించారు. 2 నెలల నుంచి 6 నెలలలోపు పిల్లలకు సగం జింక్ టాబ్లెట్ ఇవ్వాలని, 6 నెలల నుంచి నుంచి 5 ఏళ్ల వరకు ఒక జింక్ టాబ్లెట్‌తో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్ అందించాలని సూచించారు. డయేరియా కారణంగా మరణాలు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషినల్ డీఎంహెచ్‌ఓ శ్రీనివాసులురెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఛత్ర ప్రకాష్ రెడ్డి, వైద్యులు ఆనందమూర్తి, రాజా, అభిజ్ఞ పాల్గొన్నారు.

మామిడి పోరు

ఉమ్మడి జిల్లాలోని మామిడి రైతులకు దిక్కులేకుండా పోయింది. అధికారులు, పాలకుల మాటలను ఫ్యాక్టరీ యజమానులు ఖాతరు చేయడం లేదు. దీంతో మామిడి కాయలు అమ్ముకోవడానికి రైతులు యుద్ధం చేయాల్సి వస్తోంది. జీడీనెల్లూరు, తవణంపల్లె, బంగారుపాళ్యం మండలాల్లో సోమవారం టోకెన్లు ఇవ్వలేమని ఫ్యాక్టరీలు బోర్డులు పెట్టేశాయి. దీంతో ఫ్యాక్టరీల ఎదుట రైతుల ఆందోళనకు దిగి రోడ్లపై బైఠాయించారు. ఫలితంగా రహదారులపై ట్రాఫిక్ భారీగా స్తంభించిపోయింది. పోలీసుల జోక్యంతో కొన్ని ఫ్యాక్టరీలు నామమాత్రంగా టోకెన్లు ఇచ్చి చేతులు దులుపుకున్నాయి. అయినా రైతుల గోడును పట్టించుకునే నాథుడే లేకపోవడం గమనార్హం.

- పంట అమ్ముకోవడానికి తంటాలు
- పడిగాపులతో విసిగిపోయిన రైతులు
- రోడ్డెక్కిన రైతులు – స్తంభించిన ట్రాఫిక్
- జీడీనెల్లూరు, బంగారుపాళెం, తవణంపల్లెలోనూ అదే తంతు!
- పట్టించుకోని కూటమి సర్కార్


చిత్తూరు నగరం గంగాసాగరం ఫ్యాక్టరీ వద్ద గుమ్మికూడిన రైతులు

కాణిపాకం: జిల్లాలో ప్రస్తుతం తోతాపురి రకం మామిడి కాయలు పక్వానికి రావడంతో కోతలు జోరందుకున్నాయి. ఈ కాయలను ఫ్యాక్టరీ నిర్వాహకులు కొనడం లేదు. ఏదో కొన్ని ఫ్యాక్టరీలు మాత్ర బయట రాష్ట్రాల నుంచి వచ్చే తోతాపురి కాయలను కొనుగోలు చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం తోతాపురి కిలో రూ.8కు కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చినా ఫ్యాక్టరీలు వాటిని లెక్కచేయడంలేదు.

చిత్తూరులో ఏం జరిగిందంటే...

చిత్తూరు నగరం గంగాసాగరంలోని ఓ గుజ్జు పరిశ్రమ సోమవారం టోకెన్లు ఇస్తున్నట్లు వారం రోజుల ముందే బోర్డు పెట్టింది. టోకెన్లు ఇస్తారని మామిడి రైతులు ఆదివారం అర్ధరాత్రి నుంచే ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. అక్కడే కునుకు తీస్తూ.. ఆధార్, పట్టా పాసు పుస్తకం జిరాక్స్ నకలను క్యూలో పెట్టారు. ఉదయం 7గంటలకు రైతులు అక్కడికి అధిక సంఖ్యలో చేరుకున్నప్పటికీ ఫ్యాక్టరీ నిర్వాహకులు స్పందించలేదు. దీంతో రైతులంతా కలిసికట్టుగా చిత్తూరు–వేలూరు జాతీయ రహదారిపై బైఠాయించారు. ట్రాఫిక్ స్తంభించిపోవడంతో రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాలు బారులు తీరాయి. సమాచారం అందుకున్న పోలీసు లు అక్కడికి చేరుకుని ఫ్యాక్టరీ వాళ్లతో మాట్లాడారు. టోకెన్లు ఇస్తామని చెప్పడంతో ఆ తర్వాత ఫ్యాక్టరీ గేటు ను రైతులు చుట్టుముట్టేశారు. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. అక్కడ రైతుల అరుపులు, కేకలతోఫ్యాక్టరీ ఆవరణ దద్దరిల్లింది. అక్కడే ఉన్న వృద్ధురాలికి ఊపిరి ఆడలేదు. వెంటనే రైతులు ఆ వృద్ధురాలిని ఫ్యాక్టరీ లోపలికి పంపారు. ఆపై అరకొరగా టోకెన్లు ఇచ్చిన ఫ్యాక్టరీ నిర్వాహకులు వచ్చేనెల 5వ తేదీ టోకెన్లు ఇస్తామంటూ మరో బోర్డు పెట్టింది. దీంతో టోకెన్లు అందని రైతులు మళ్లీ నిరసనకు దిగారు.

రైతుల గోడు పట్టని ప్రభుత్వం

రైతులు తాము పండించిన మామిడి కాయలు అమ్ముకోవడానికి చావో రేవో అని పోరాడుతున్నారు. అయినా ఈ ప్రభుత్వానికి మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేదు. రాత్రి, పగలు తేడా లేకుండా నిద్రాహారాలు మాని ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటివరకూ ఏ ఒక్క అధికారి కానీ, ప్రజాప్రతినిధి కానీ వారి వైపు కన్నెత్తి చూడడం లేదు.

పలుచోట్ల ఇదే పరిస్థితి

గంగాధర నెల్లూరు మండలంలో మూడు రోజులుగా కాయలను అన్‌లోడింగ్ చేయకుండా ఇబ్బంది పెడుతున్నారంటూ రైతులు రోడ్డెక్కడంతో రాకపోకలు స్తంభించాయి. ఫ్యాక్టరీ వద్ద ట్రాక్టర్లు క్యూకట్టాయి. బంగారుపాళ్యం మండలంలో కూడా ఫ్యాక్టరీలు టోకెన్లు ఇవ్వకుండా తలుపులు వేసేశాయి. వచ్చే నెల టోకెన్లు ఇస్తామని ముఖం చాటేశాయి. ఒక చేసేది లేక రైతులు ఫ్యాక్టరీ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగి, చివరికి రోడ్డుపైకి వచ్చి ధర్నా చేశారు. తవణంపల్లె మండలంలోని ఫ్యాక్టరీలు కూడా మామిడి రైతులకు టోకెన్లు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నాయి.

కూటమి నేతల సిఫార్సులకే టోకెన్లు

కూటమి నేతల సిఫార్సులకు మామిడి టోకెన్లు అమ్ముడుబోతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసు, రెవెన్యూ, కలెక్టరేట్, ఇతరత్రా అధికారుల పేర్లు చెబుతూ టోకెన్లను దండుకుంటున్నారని ఫ్యాక్టరీ నిర్వాహకులు బహిరంగంగా చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్య రైతులు నిండి మునిగిపోతున్నారు. జిల్లాల్లో కొద్ది రోజులుగా హల్‌చల్ చేసిన రైతు సంఘం నాయకులు ఫ్యాక్టరీల ఎదుట కనిపించడం లేదు. కేవలం వారి పంటను మాత్రం అమ్ముకుని వెళ్లిపోయారని సామాన్య రైతులు చెబుతున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలు వేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రాపూరు:యోగాతో సంపూ ర్ణ ఆరోగ్యం పొందవచ్చని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూ రు ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ తెలిపారు. సోమవారం రాపూరు మండలం పెంచలకోనలో నిర్వహించిన యోగాంధ్రలో ఆయన పాల్గొన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా చేపట్టే యోగా కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పర్యటకశాఖ అధికారి ఉషశ్రీ, నోడల్ అధికారి యతియాజ్, డ్వామా పీడీ గంగా భవానీ, డీసీఓ గుర్రప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటరమణ, ఎంపీడీఓ భవానీ, తహసీల్దార్ లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

తిరుపతి క్రైమ్ : అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. తిరుపతిలోని సత్యనారాయణపురం రాజు నగర్‌కు చెందిన సురేష్ (47) ఫారెస్ట్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. అప్పులు ఎక్కువ కావడంతో తట్టుకోలేక పురుగుల మందు తాగేశాడు. కుటుంబీకులు హుటా హుటిన ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడు కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

మామిడి రైతుకు అండగా ఉంటాం

- రైతుల ఆందోళనపై తక్షణమే ప్రభుత్వం స్పందించాలి
- కిలో రూ.8 చొప్పున కొనుగోలు చేయాలి
- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి ప్రతినిధి, తిరుపతి : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి సాగు చేసిన రైతులు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నారని సోమవారం పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మామిడి రైతులు కన్నీరు పెడుతున్నా కూటమి ప్రభుత్వానికి కనికరించడం లేదని మండిపడ్డారు. రైతుల గోడుపై తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు. కచ్చితంగా మామిడి కిలో రూ.8 చొప్పున కొనుగోలు చేయించాలని, లేకుంటే వైఎస్సార్‌సీపీ ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతుందని హెచ్చరించారు. మామిడి రైతుకు న్యాయ జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. ఆయన మాటల్లోనే..

- మామిడికి కనీస గిట్టుబాటు ధర కూడా దక్కకడం లేదు. ఫ్యాక్టరీలు కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నాయి., పొరుగు రాష్ట్రాల నుంచి మామిడి దిగుమతి చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం.
- మామిడి రైతులు తమ పంటలను ట్రాక్టర్లో తీసుకువచ్చి ఫ్యాక్టరీల ముందు రోజుల తరబడి పడిగాపులు కాస్తుంటే, పొరుగు రాష్ట్రాల మామిడి నేరుగా ఫ్యాక్టరీల్లోకి వెళ్లిపోతోంది. రాష్ట్రంలో ప్రభుత్వం పనిచేస్తోందా? సరిహద్దుల్లో చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని చెబుతున్నారు. అయితే.. ఇతర రాష్ట్రాల నుంచి వాహనాల్లో మామిడి ఎలా వస్తోంది. ఫ్యాక్టరీ నిర్వాహకులతో కూటమి నేతలు కుమ్మక్కై రైతులను నాశనం చేస్తున్నారు.
- తోతాపురి రకం అమ్ముడుపోక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదుకోవాలంటూ మామిడి రైతులు రోడెక్కారు. , జిల్లాలో పలుచోట్ల ఆందోళనలు చేస్తున్నారు.
- గుజ్జు ఫ్యాక్టరీలు కాయల కొనుగోలుకు టోకెన్ సిస్టమ్ తీసుకువచ్చాయి. ఈ టోకెన్‌ల కోసం రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. అయితే ఫ్యాక్టరీలు మాత్రం అరకొర టోకెన్లు మాత్రమే జారీ చేస్తునాయి. . మిగిలినవి కూటమి నేతలు చెప్పిన వారికే గంపగుత్తగా ఇచ్చేస్తున్నాయి.
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పినట్లు ఎక్కడైనా కిలో మామిడి రూ.8లకు కొనుగోలు చేస్తున్నారా? నిరూపించే ధైర్యం కూటమి ప్రభుత్వానికి ఉందా? రైతులతో ఈ మాట చెప్పించగలరా? ఇంత దౌర్భగ్య పరిస్థితి ఎప్పుడూ చూడలేదు.
- తోతాపురి పంటను ఫ్యాక్టరీలు కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపడం లేదు. రైతుల ఆగ్రహం చూసిన కూటమి ప్రభుత్వం కిలో రూ.8 చొప్పున కొనుగోలు చేయాలని ఫ్యాక్టరీలను ఆదేశించి చేతులు దులుపుకుంది. ప్రభుత్వం తరపున కిలోకు రూ.4 చొప్పున ప్రోత్సాహక నిధి ఇస్తామని గొప్పగా ప్రకటించింది. అయితే ఎక్కడా అమలు జరగడం లేదు.
- ప్రభుత్వం సైతం జిల్లా రైతులను దగా చేస్తోంది. కూటమి నేతల కోసం ఫ్యాక్టరీలకే కొమ్ముకాస్తోంది. మామిడి కిలోకి రూ.12 గిట్టుబాటు అవుతుందని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తోంది. క్షేత్రస్థాయిలో ఫ్యాక్టరీలు మాత్రం కేవలం రూ.6 మాత్రమే రైతులకు చెల్లిస్తున్నాయి.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గుజ్జు ఫ్యాక్టరీల వారు పంట కొనుగోలు చేసిన వారానికే రైతులకు నగదు అందించేవారు. ఇప్పుడు 3 నెలలకు ఇస్తామని తెగేసి చెబుతున్నారు. కాదంటే సరుకు కొనము వెళ్లిపోండి అని తరిమేస్తున్నారు.
- మామిడిని ఎకరా సాగు చేయాలంటే కనీసం రూ.45వేలు ఖర్చవుతోంది. ఫ్యాక్టరీల వారు చిన్న మచ్చ ఉంటే కూడా కాయలు కొనడం లేదు. దీంతో రైతులకు కనీసం పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి కనిపించడం లేదు.
- గతంలో తోతాపురి రకం కోత సమయంలో పండు కాయలు తక్కువ ధరకు కొని పల్ప్ ఆడించేవారు. ఇప్పుడు చిన్న మచ్చ ఉన్న కాయలు గ్రేడింగ్‌లో పారేస్తున్నారు.
- మామిడి కొనుగోలు విషయంలో రైతుల గోడును కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలాంటి దుస్థితి ఎప్పుడూ రైతులకు రాలేదు. అప్పట్లో ధర పడిపోతే ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులు నష్టపోకుండా కొనుగోలు చేయించింది.
- కూటమి ప్రభుత్వానికి అమరావతి తప్పమామిడి రైతుల కష్టాలు కనిపించడంలేదు. మామిడి రైతులకు న్యాయం జరిగేవరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదు.
- వైఎస్సార్‌సీపీ ప్రత్యేక కార్యాచరణతో రైతులకు అండగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం మెడలు వంచి, గిట్టుబాటు రేటుకు మామిడిని కొనుగోలు చేయించే వరకు పోరాటం కొనసాగిస్తుంది.

సమస్యల వెంబడి వినతులు

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు వినతులు వెల్లువెత్తాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టర్, జేసీ తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై మొత్తం 307 వినతులు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

మా బడి.. మా ఊరిలోనే..

పుత్తూరు మండలం నేసనూరు వడ్డిపాళెం వాసులు తమ గ్రామంలోని బడిని కొనసాగించాలని కోరారు. తమ ఊరిలో 100 కుటుంబాలు ఉన్నాయని, 1 నుంచి 5వ తరగతి వరకు 30 మంది పిల్లలు ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్నారని తెలిపారు. అయితే క్లస్టర్ పేరుతో ప్రభుత్వం మా బడిలోని 3,4,5 తరగతులను నేసనూరులోని ప్రాథమిక పాఠశాలకు మార్పు చేశారని వాపోయారు. వడ్డిపాళెం నుంచి ఆ గ్రామంలోని స్కూల్‌కు వెళ్లేందుకు 2.5 కిలోమీటర్లు నడవాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలోని పాఠశాలకు పక్కా భవనం కూడా నిర్మించారని, నాడు–నేడు కింద సకల వసతులు ఉన్నాయని వెల్లడించారు. అయితే కూటమి ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల ఇంత దారుణంగా వ్యవహరించడం సరికాదని మండిపడ్డారు. మా ఊరిలోని బడిని ఇక్కడే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్, డీఈఓకు వినతిపత్రాలు సమర్పించారు.


కలెక్టరేట్‌లో నినాదాలు చేస్తున్న చిన్నసింగమాల వాసులు


నిరసన తెలుపుతున్న నేసనూరు వడ్డిపాళెం గ్రామస్తులు

క్లస్టర్ కష్టాలు

కూటమి ప్రభుత్వం వైఖరితో పిల్లలకు క్లస్టర్ల కష్టాలు వచ్చాయి. క్లస్టర్ పేరుతో పాఠశాలలు కుదింపులపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. చిన్న పిల్లలు కిలోమీటర్ల దూరం నడిచిమరో గ్రామానికి వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తొట్టంబేడు మండలంల చిన్నసింగమాలకు చెందిన పలువురు పిల్లలు, వారి తల్లిదండ్రులు కలెక్టరేట్‌కు విచ్చేశారు. ఏళ్ల తరబడి తమ గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉందని, అయితే క్లస్టర్ పేరుతోఈ స్కూల్‌ను మూడు కిలోమీటర్లు దూరంలో గురుకులపాఠశాలకి మార్చారని వాపోయారు. మార్గం మధ్యలో తెలుగుగంగ కాలువను దాటుకుని వెళ్లాల్సి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఇబ్బందులను అధికారులు అర్థం చేసుకుని తమ గ్రామంలోని పాఠశాలను కొనసాగించాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు.

చిరుద్యోగులకు 'వందనం' ఇవ్వాలి

ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల పిల్లలకు తల్లికి వందనం ఔట్స్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రభుత్వం తల్లికి వందనం పథకం అందించాలని ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సుమన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఓ వినతిపత్రం అందించారు.

ప్రభుత్వ భూముల కబ్జాపై ఫిర్యాదు


జేసీకి వినతిపత్రం అందిస్తున్న పేరూరు వాసులు

తిరుపతి రూరల్ : మండలంలో ప్రభుత్వ భూముల కబ్జాపై ఉద్యమం చేపడతామని, ప్రధానంగా పేరూరు పంచాయతీలో ఆక్రమణదారులు రెచ్చిపోతుంటే రెవెన్యూ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని సర్పంచ్ దామినేటి కేశవులు మండిపడ్డారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో కలెక్టర్, జేసీకి ఫిర్యాదు చేశారు. రూ.కోట్ల విలువైన సర్కారు భూములను కాపాడాలని, దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా తహసీల్దార్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పేరూరులోని సర్వే నంబర్లు 529/4ఏ, 488, 02లోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు సాగిస్తున్నారన్నారు. 529/4ఏలోని 0.98 సెంట్ల విలువ సుమారు రూ.20 కోట్లు ఉంటుందని వెల్లడించారు. అలాగే సర్వే నంబర్లు 488, 02 సర్వే నంబర్లలో అక్రమ కట్టడాలను తొలగించి హెచ్చరిక బోర్డులు పెట్టాలని విన్నవించారు. ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, నేతలు చెంచుమోహన్‌యాదవ్, చింతల ప్రసాద్, కృష్ణమూర్తిరెడ్డి, రాజారెడ్డి, కార్తీక్ పాల్గొన్నారు.






బాధ్యత మీది.. బరువు మాది!

కడుపున పుట్టిన వారికి ఇసుమంత కష్టం వచ్చినా తల్లిదండ్రులు తల్లడిల్లిపోతారు. అరచేతిలో పెట్టుకుని పెంచుకున్న బిడ్డలకు కాసింత ఇబ్బంది కూడా కలగకుండా కళ్లలో పెట్టుకుని కాపాడుకుంటారు. ఏడాది పొడవునా చదువులమ్మ ఒడిలో నిరంతరం శ్రమించే పిల్లలతో చిన్నపాటి బరువును కూడా మోపకుండా బాధ్యతలను నెత్తికెత్తుకుంటారు. సోమవారం తిరుపతిలోని పలు విద్యాసంస్థల ఎదుట ఇదే దృశ్యం కనిపించింది. జన్మనిచ్చిన వారి మమకారం ఎలా ఉంటుందో కళ్లెదుట సాక్షాత్కరించింది. టీటీడీ కాలేజీలు.. ఎస్వీయూ.. మహిళా వర్సిటీ పరిధిలోని కళాశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులను వదిలిపెట్టేందుకు తల్లిదండ్రులు తరలివచ్చారు. ఆయా హాస్టళ్ల వరకు లగేజీలను తీసుకు వచ్చి పిల్లలకు అందించారు. బ్యాగులు.. పెట్టెల బరువును పంచుకునేందుకు బిడ్డలు ముందుకు వచ్చినా.. మీరు ఇష్టపడి చదువుకోండి.. మేం సంతోషంగా కష్టపడతాం అంటూ ప్రేమాభిమానాలు చాటుకున్నారు. బాధ్యతగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ క్రమంలోనే వేసవి సెలవుల కారణంగా బోసిబోయిన కాలేజీలు విద్యార్థులతో కళకళలాడాయి. దాదాపు 45 రోజుల విరామం తర్వాత కనిపించిన స్నేహితులతో కబుర్లు ఎల్లలు దాటాయి. పరస్పరం యోగక్షేమాలను తెలుసుకుని అందరి మనసులు ఆనందంతో నిండిపోయాయి. – తిరుపతి సిటీ